క్లుప్తంగా

మహాభారత యజ్ఞం ప్రారంభం

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో మాండవ్యానది ఒడ్డున వెలసి యున్న శ్రీ మల్లూరమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో గురువారం 12వ శ్రీ పంచమ వేదం మహాభారతయజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. అన్నమాచార్య ప్రాజెక్ట్ టీటీడీ భాగవతారిణి జీఎన్కె సీతాలక్ష్మీ మహాభారతాన్ని వినిపించారు. సమీప ప్రాంతాల భక్తులు పలువురు ఈ యజ్ఞంలో పాల్గొన్నారు.

పన్నులు రాబట్టండి

రాజంపేట : పట్టణవాసుల నుంచి పన్నులు రాబట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం తన చాంబరులో సచివాలయ కార్యదర్శులతో పన్ను వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, కుళాయి పన్ను వసూళ్లను గణనీయంగా పెంచాలన్నారు. పన్నుల సేకరణను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను తెలియజేసి, సకాలంలో పన్నులు చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయం పరిధిలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో పారదర్శకత పాటించడమేకాక పనితీరు ప్రతిభావంతంగా మార్చుకోవాలన్నారు.

నివాళి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు ఓబిలి చెంగల్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి చెంగల్‌రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు ఆకేపాటి రమేష్‌రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, అరిగెల సౌమిత్రి, అరిగే హరిబాబు, గుండు గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, సుబ్రమణ్యంరెడ్డి, మధురాజు, రామమోహన్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చందుతో మాట్లాడుతున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని మాజీ జెడ్పీటీసీ మార్రెడ్డి రాజేశ్వరమ్మ కుమారుడు చందు గుండెకు శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నాడన్న విషయం గురువారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయం తెలుసుకొని అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, అన్వర్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

సిద్దవటం (ఒంటిమిట్ట) : సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. మండలంలోని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ వాతావరణంలో మార్పు వల్ల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్త వహించాలన్నారు. వర్షాల కారణంగా మీ పరిసర ప్రాంతాలలో వర్షపునీరు, మురికినీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి పూర్తిగా నీటిని తొలగించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అపరిశుభ్రత పూర్తిగా తొలగింపు చర్యలు చేపట్టాలని ఆయన తెలియజేశారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



రవీంద్రబాబు, ఎస్ఐ

లక్కిరెడ్డిపల్లి : ప్రతి ఒక ద్విచక్రవాహనదారుడు హెల్మెట్‌ను ధరించి ప్రాణాన్ని రక్షించుకోవాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు ప్రమాదాలకు గురైనప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై సీజ్ చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు వాహనదారులు సహకరించాలని తెలియజేశారు.

నేడు ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలు

కడప అర్బన్ : నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో డాక్టర్ బాలిరెడ్డి లైన్‌లో వున్న అర్జున్ హాస్పిటల్‌లో 23వ తేదీ శుక్రవారం చెన్నై అపోలో హాస్పిటల్ నుంచి లివర్ వైద్య నిపుణులు డాక్టర్ యువియు వంశీధర్ రెడ్డి విచ్చేయనున్నారన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా ఫైబ్రో స్కాన్ పరీక్షలను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటల వరకు డాక్టర్ అందుబాటులో ఉంటారు. వివరాలకు 9985422583, 8332080900 సంప్రదించాలన్నారు.

నాడు వైభోగం.. నేడు శిథిలం

- ముళ్లపొదల చాటున వెలవెలబోతున్న భోగంరాణి బావి
- రాజుల కాలంలో విరాజిల్లిన విడిది కేంద్రం



శిథిలావస్థలో ఉన్న భోగం రాణి బావి

సిద్దవటం : పురావస్తు శాఖ నిర్లక్ష్యానికి గురైన రక్షిత కట్టడాల్లో భోగం రాణి బావి ఒకటి. ఇది మండల కేంద్రమైన సిద్దవటానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఎస్.రాజంపేట – వంతాటిపల్లె గ్రామాలకు మధ్యలో ఉంది. పూర్వము సిద్దవటం కోటను మట్లి రాజులు, సూర్యవంశ రాజులు పాలించేటప్పుడు దీనికి మంచి గుర్తింపు ఉండేది. రాజుల విశ్రాంతి కోసం అక్కడికి వెళ్లేవారు. దీనికి భోగం రాణి బావి అని పేరు రావడానికి వెనుక పెద్దలు చెప్పే కథల్లో ప్రముఖమైనది ఒకటుంది. అదేంటంటే.. సిద్దవటం కోటను హకీంఖాన్ పాలించే రోజుల్లో ఆయనకు ఒక ఉంపుడుగత్తె ఉండేది. ఆమె తనకో సుందరమైన భవనాన్ని నిర్మించాలని ఆయన్ను కోరింది. షరా మామూలు గానే ఆయన సమ్మతించారు. అయితే ఆమె కోరిక ప్రకారం కట్టించాలంటే ఖర్చు చాలా అవుతుందని వడ్డెరలు హకీంఖాన్‌కు చెప్పారు. అందుకు ఆయన ఆమె ఇస్తుందిలే అని కానివ్వమన్నారు. ఒక తూముడు బంగారు నాణేలు ఇచ్చే ఒప్పందంపై భవనాలను బావిని నిర్మించారు. పని పూర్తి అయ్యాక తమకి ఇస్తానని చెప్పిన నాణేలు ఇవ్వాలని వడ్డెరలు ఆ భోగం సుందరి వద్దకు వెళ్లారు. ఆమె ఓ గొడ్డలి తెచ్చి కట్టె తీసేసి గొడ్డలికి ఉన్న రంధ్రంలో కొన్ని బంగారు నాణేలు వేసి ఇదిలో తూము నిండా తీసుకోమందట, ఇది అన్యాయమని వడ్డెరలు ఆమెతో గొడవకు దిగినా ఆమె ఖాతరు చేయలేదట. దీంతో ఒళ్లు మండిన వడ్డెరలు భవనం మధ్యలో బావిపై నిర్మించిన ఊయాలపై ఊగేటప్పుడు ఆ బావిలో పడి చస్తావని శపించారు. ఆ ప్రకారమే ఆమె ఒక రోజు ఊయాలతో బావిలో పడి మరణించిందట, అప్పటి నుంచి ఆ భవన సముదాయానికి భోగం రాణి బావి అని పేరు వచ్చింది. ఆమె కూడబెట్టిన సొమ్మంతా పెట్టెలో ఉంచి ఆ బావిలోనే దాచినట్లు ప్రచారముంది. బావిలోకి దిగటానికి నాలుగు వైపుల నుంచి మెట్లు ఏర్పాటు చేసి సుందరంగా నిర్మించబడిన భోగం రాణి బావి ప్రస్తుతం పూడిపోయింది. భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. కొంతభాగం పైకప్పు ఉన్నప్పటికీ చాలా వరకు మొండి గోడలే మిగిలాయి. భోగం రాణిబావి కదా! ఎంత శిథిలమై పోయినా ఇప్పటికీ చాలా అందంగా కనిపిస్తోందనే మాటలు స్థానికులు చెప్పుకుంటుండటం విశేషం. శిథిలావస్థకు చేరిన కట్టడాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని పలువురు మండల వాసులు పర్యాటక శాఖ అధికారులను కోరుతున్నారు.

జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి



ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది ప్రజలు

లక్కిరెడ్డిపల్లి : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అనంతపురం జిల్లాకు చెందిన మురళీ నాయక్ వీరమరణం చెందిన ఘటనకు సంఘీభావంగా గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు మండలస్థాయి అధికారులు, అంగన్‌వాడీ, డ్వాక్రా మహిళలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. అమరులైన భారత జవాన్లను స్మరించుకుంటూ మురళీ నాయక్ అమర్ హై, భారత మాతాకీ జై అంటూ జాతీయ జెండాలతో ర్యాలీ పాల్గొన్నారు. మూడురోడ్ల కూడలి వద్ద జవాన్ మురళీ నాయక్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

ఉపాధి కూలీ రూ.600లు ఇవ్వాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పండుగోల మణి

ఓబులవారిపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి డబ్బులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి పేర్కొన్నారు. గురువారం మంగంపేట అగ్రహారంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ ఉపాధి పనులు కూలీలకు కొలతలతో పని లేకుండా ఇప్పుడు ఉన్న ధరలకు అనుగుణంగా రూ. 600లు ఇవ్వాలని, ప్రతి కూలీకి పనిముట్లు అందించాలన్నారు. అలాగే పనిచేసే ప్రాంతంలో నీడ ఉండేలా ఏర్పాటు చేసి చిన్న పిల్లలకు, గర్భిణులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే ప్రమాదాలు సంభవించినప్పుడు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పనులు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటే రవాణా చార్జీలు ప్రభుత్వం భరించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధిహామీ కూలీలతో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య, దార్ల నాగేశ్వరరావు, మోడి శివయ్య, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజంపేట : మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనకార్యక్రమంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాజంపేట పురపాలక పరిధిలో 15 మంది బదిలీ కార్మికులకు మూడు మాసాల నుంచి వేతనాలు ఇవ్వలేదన్నారు. పలుమార్లు అధికారులను కలిసి విన్నవించామన్నారు. బిల్లులు పెట్టామని, రావడంలేదన్నారు. రిటైర్డ్ కార్మికులకు ప్రతినెల రూ.5వేలు ఫించన్ మంజూరు చేయాలన్నారు. సబ్బులు, నూనె వంటి నిత్యావసర సరుకులు అందజేయాలన్నారు. కార్మికులకు ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యానికి రూ.50 వేలు నుంచి రూ.70 వేలు వ్యయం చేసుకొని కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నారన్నారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీపీ రమణ, నేతలు ప్రసాద్, బుజ్జమ్మ, గంగయ్య, సురేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, రూపానందరెడ్డిలు

చిట్వేలి : మండల పరిధిలోని సి.కందులవారిపల్లి పంచాయతీలో రూ. 1.20 కోట్లతో నిర్మించనున్న కస్తూర్బా జూనియర్ కళాశాలకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంగ జాతర



పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో గురువారం గంగమ్మ జాతర ప్రజలు, మహిళలు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, నిర్వహించి జాతర చేశారు. అనంతరం మహిళలు గంగమ్మకు పొంగుబాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎంపీపీ భవాని, రాజగోపాల్, సుబ్బారావులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాజంపేట రూరల్ : యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని నలంద నగర్‌లో శ్రీనివాసులు నూతనంగా ఏర్పాటు చేసిన లైఫ్ స్టైల్ సెలూన్‌ను గురువారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటిని, మున్సిపల్ చైర్మన్ పోలాను నిర్వాహకులు సన్మానించారు.

రైతుల పక్షాన పోరాటమే లక్ష్యం



జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా పేదల పక్షాన పోరాటమే సీపీఐ లక్ష్యమని రైల్వేకోడూరు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య పేర్కొన్నారు. గురువారం కొత్తమంగంపేట అగ్రహారంలో సీపీఐ గ్రామశాఖ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ తరపున మంగంపేట సమస్యలపై పోరాటం చేస్తామని, మంగంపేట పంచాయతీలో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, మౌలిక సదుపాయాల ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, మండల కార్యదర్శి మల్లిక, వెంకటరమణ, పోకూరి మురళీ, పోకూరి సునీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



నిర్మాణంలో ఉన్న ఇంటి పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సహదేవరెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహించాలని ప్రత్యేక అధికారి సహదేవ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డి మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. చెత్త సంపద కేంద్రాలు గ్రామాలలో చెత్తను సేకరించి నిర్వహణ చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు మంజూరు చేయాలి



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న రైతు నాయకులు

లక్కిరెడ్డిపల్లి : అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, రైతు సంఘం రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు వడ్లమూడి హరినాథ నాయుడులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌తో కలిసి అర్హులైన రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు అనేక ఆర్థిక ఇబ్బందులతో వేసిన పంటలకు గిట్టుబాటు ధరలు, పంటలు చేతికి అందక కష్టాలలో ఉన్న రైతులకు బ్యాంకర్ల ద్వారా సకాలంలో రుణాలు మంజూరు చేసి, రెన్యువల్ చేయడానికి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిద్దాం

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం గంగిరెడ్డిగారిపల్లెలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు వెంకటలక్ష్మమ్మ, అంజనమ్మలను ఘనంగా సన్మానించారు. అనంతరం పీఎండీఎస్ వలన కలిగే లాభాలు, ప్రయోజనాలు, మోడల్స్, కిచెన్ గార్డెన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్ తన్మయి, ఐసీఆర్‌పీలు రామాంజులు, కిరణ్, రఘు, వెంకట్రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా



గ్రామంలో ట్యాంకర్లతో తాగునీటిని అందిస్తున్న పంచాయతీ అధికారులు

సిద్దవటం (ఒంటిమిట్ట) : మండలంలోని చలమారెడ్డి కొట్టాలు గ్రామంలో వర్షాలు కారణంగా విద్యుత్ స్తంభాలు పడిపోయి గ్రామంలో విద్యుత్ స్తంభించడంతో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ట్యాంకర్ల ద్వారా పంచాయతీ అధికారులు తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సెక్రటరీ విజయ్ గురువారం మాట్లాడుతూ చలమారెడ్డి కొట్టాలు గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు విద్యుత్ అంతరాయం కారణంగా గత ఐదు రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి రెండు ట్యాంకర్ల ద్వారా తాగునీరు గ్రామ ప్రజలకు అందజేశామన్నారు. గ్రామంలో మంచినీటి ఎద్దడి లేకుండా సమస్య పరిష్కారం చేశామని పంచాయతీ సెక్రటరీ విజయ్ తెలిపారు.

మత విద్వేషాలకు అతీతంగా జాతరలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

సుండుపల్లె : మండల ప్రజలు నాగారపమ్మ తల్లి, మడితేటమ్మ జాతరలను పురస్కరించుకొని మత విద్వేషాలకు అతీతంగా సామరస్యంగా సోదరభావంతో ప్రతి ఒక్కరూ మెలగాలని రాయచోటి డీఎస్పీ కృష్ణ మోహన్ తెలిపారు. ఆయన గురువారం హిందూ, ముస్లిం మత పెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు వారి ఆచారాల ప్రకారం శాంతియుతంగా కార్యక్రమాలను జరుపుకోవాలని సూచించారు. ఒకరి మనోభావాలను మరొకరు గౌరవిస్తూ మతసామరస్యానికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. జాతర్ల సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అందరూ స్నేహభావం, సోదర భావంతో సామరస్యంగా ఒక్కటిగా ఉండాలని తెలియజేశారు. చాందినీ బండ్లు, డీజేలు పెట్టేవారు పోలీస్ అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీ

వీరబల్లి : మండల కేంద్రంలో గురువారం స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాహనాలు ఆపి డ్రైవర్లకు ఉండాల్సిన లైసెన్సులు, ముఖ్యంగా హెల్మెంట్ లేని వారికి జరిమానా విధించారు. వీటితోపాటు ఆటోలు, ఫోర్ వీలర్స్, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను ఆపి తనిఖీలు చేయడమే కాకుండా సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యంగా యువత వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, అలా పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల క్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వాహనదారులు హెల్మెట్లు, ఇన్సూరెన్సు కలిగి ఉండాలని సూచించారు.

అంజనీపుత్రుడు.. ఆరాధ్య దేవుడు

హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం ఆంజనేయుని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజారులు అంజనీపుత్రుడికి వేకువజాము నుంచే అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అలానే ఆకుపూజ జరిపారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులతో అంజన్న ఆలయాల వద్ద జాతర వాతావరణం కనిపించింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



చిట్వేలి: రాజుకుంట క్రాస్ వద్ద ఉన్న సంజీరాయ స్వామి ఆలయంలో అన్నదానం



రాజంపేట రూరల్: వడమాలతో దర్శనమిస్తున్న స్వామి



రైల్వేకోడూరు అర్బన్: అలంకరణలో ముదుగుంటపల్లి ఆంజనేయస్వామి



పుల్లంపేట: దర్శనమిస్తున్న కోటగడ్డ అభయాంజనేయస్వామి



నందలూరు: ప్రకాశం వీధిలో అన్నదానం



ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నదాన కార్యక్రమం



ఒంటిమిట్ట: దర్శనమిస్తున్న భక్త సంజీవరాయుడు



రైల్వేకోడూరు అర్బన్: బొజ్జవారి పల్లిలోని ఆంజనేయ విగ్రహం



సంబేపల్లె: సింధూర అలంకరణలో ఆంజనేయుడు



సుండుపల్లె: గుట్టకాడ బలిజపల్లె గ్రామంలోని గుట్టపై ఉన్న ఆలయంలో కల్యాణ వేడుక



రాయచోటి జగదాంబ సెంటర్: అలంకరణలో ప్రసన్న ఆంజనేయుడు



ఒంటిమిట్ట: భక్త సంజీవ రాయునికి ప్రత్యేక పూజలు



రాజంపేట రూరల్: వైబీఎన్ పల్లిలోని అభయ ఆంజనేయుడు



రాయచోటి టౌన్: స్వామిని దర్శించుకొంటున్న భక్తులు